క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

పెన్‌పహాడ్ : మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు కార్మిక లోకం సన్నద్ధం కావాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం పెన్‌పహాడ్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జాతీయత పేరుతో అధికారంలోకి వచ్చిన మోదీ.. జాతీయ సహజ సంపదలను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని అన్నారు.

వననర్సరీ పరిశీలన



వననర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోపి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరు గ్రామంలో వననర్సరీని ఆదివారం ఎంపీడీఓ టి.గోపి పరిశీలించారు. అలాగే గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫర్హానా, ఫీల్డ్ అసిస్టెంట్ సుజాత, నర్సరీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని వేల్పుచర్లలో ఆదివారం పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వంద పశువులకు మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది యాకయ్య, మాజీ సర్పంచ్ ఖమ్మంపాటి కరుణాకర్, రైతులు వెంకన్న, మధుసూదన్, పరమేష్, అవిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సోడమ్మ జాతర ప్రారంభం

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామంలో సోడమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఆదివారం ప్రాంభమయ్యాయి. తొలిరోజు భక్తులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాలు ఈ నెల 7 వరకు జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూర్యనాయక్‌తండాలో బడిబాట ప్రచారం



సూర్యనాయక్‌తండాలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యనాయక్ తండాలో ఆదివారం ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తండాలో ఇంటింటి ప్రచారం చేసి పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కైరంకొండ రమేష్, ఉపాధ్యాయుడు బి.లింగయ్యయాదవ్, సీఆర్‌పీ ఆర్.వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ బిక్కునాయక్, తండావాసులు పాల్గొన్నారు.

కులగణన నిర్ణయంపై హర్షం

మునగాల : దేశ వ్యాప్తంగా కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం హర్షణీయమని బీసీ విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణయాదవ్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న ఓబీసీలను గుర్తించి కులగణన చేస్తామని ప్రకటించడం ఉద్యమనాయకుల విజయమన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య జాతీయస్థాయిలో ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోయారని గుర్తుచేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు.

అన్నదానం గొప్పది



అన్నదానం ప్రారంభిస్తున్న ఏఎస్‌ఐ

సూర్యాపేట అర్బన్ : అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదని చివ్వెంల ఏఎస్‌ఐ గునగంటి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని 1వ వార్డులో గల శ్రీ అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆశ్రమంలో చిత్తలూరు నరేష్ -మమత వివాహ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. శారీరక, మానసిక వికలాంగులను చేరదీసి సేవ చేయడం చాలా అభినందనీయమని అన్నారు. ఫంక్షన్లలో మిగిలిపోయిన ఆహారాన్ని పడేయకుండా ఇలాంటి సంస్థలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో మంకెన మధు, గునగంటి అంజయ్యగౌడ్, శ్రీ వర్షిత్, శాన్వి, కౌశిక్, శ్రీ చరణ్, నిర్వాహకురాలు దేవరకొండ వనజ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వారధి నిర్మాణానికి మోక్షం..!

- గుండ్లసింగారం వంతెన నిర్మాణానికి రూ.13.50కోట్లు మంజూరు
- ప్రస్తుత వంతెన ప్రమాదకరంగా మారడంతో భయాందోళన చెందుతున్న ప్రయాణికులు
- నూతన వారధి పనులను వెంటనే ప్రారంభించాలని వేడుకోలు



శిథిలావస్థలో ఉన్న గుండ్లసింగారం వంతెన

నూతనకల్ : సూర్యాపేట–దంతాలపల్లి రహదారిపై గుండ్లసింగారం వద్ద ఉన్న నూతన వంతెన నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలగనుంది. రహదారిపై వారధి నిర్మాణం కోసం ఇటీవల ప్రభుత్వం రూ.13.50కోట్లు మంజూరు చేసింది.

ఇన్నాళ్లూ భయం, భయంగా..

మూడు జిల్లాల ప్రజలు నిత్యం రాకపోకలు కొనసాగించే సూర్యాపేట–దంతాలపల్లి రహదారిపై గుండ్లసింగారం వద్ద ఉన్న వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నాయి. గుండ్లసింగారం శివారులోని పాలేరు వాగుపై వంతెనను సుమారు 75ఏళ్ల క్రితం నిర్మించారు. అయితే రహదారి ఎలాంటి మరమ్మతులకు నోచుకోకపోవడం, ప్రతి సంవత్సరం వాగు ఉధృతికి వారధి దెబ్బతింటుండడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇన్నేళ్లుగా అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయడం తప్పా వారధి నిర్మాణానికి పూర్తిస్థాయిలో కృషి చేసిన దాఖలాలు లేవు. ప్రధానంగా సూర్యాపేట జిల్లా కేంద్రం నుంచి మహబూబాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలకు వెళ్లడానికి ప్రయాణికులు, వాహనదారులు ఈ వారధి దాటాల్సి ఉంటుంది. ఈ వంతెనపై నుంచి నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ప్రధానంగా ములుగు జిల్లా మల్లంపల్లి, కరీంనగర్ జిల్లా నుంచి సిమెంట్ పరిశ్రమలకు నిత్యం ఎర్రమట్టిని లారీల ద్వారా తరలిస్తుంటారు. భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో వంతెనకు ఎప్పుడు ఏ ప్రమాదం వాటిల్లనుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. గతంలో వంతెనను డంగుసున్నంతో నిర్మించారు. స్లాబ్ కింద పెచ్చులూడిపోవడంతో స్లాబ్ సువ్వలు తుక్కుబట్టి తెగి వేలాడుతున్నాయి. ఆగస్టులో వచ్చిన వర్షాలకు వరద వంతెనపై నుంచి ప్రమాదకర స్థాయిలో ప్రవహించింది. దీంతో వంతెన పక్కన రోడ్డుతోపాటు బ్రిడ్జి పిల్లర్ కింద కోతకు గురైంది. తాత్కాలిక మరమ్మతుల కోసం అధికారులు రూ.3లక్షలు మంజూరు చేసి కోతకు గురైన భాగాన్ని పునరుద్ధరించారు.

వారధి నిర్మాణానికి నిధులు..

ప్రయాణికుల, ప్రజల ఇబ్బందులు తొలగించేందుకు వారధి నిర్మాణానికి ఎమ్మెల్యే మందుల సామేల్ సహకారంతో రూ.13.50కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వారధి నిర్మాణానికి మోక్షం కల్పించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా వారధి నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగనున్నట్లు తెలుస్తోంది. వారధి నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టి ప్రయాణికులు, వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.



స్లాబ్ పెచ్చులూడి సువ్వలు తేలిన వంతెన

నిధుల మంజూరుపై హర్షం



వారధి నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం హర్షణీయం. శిథిలావస్థలో ఉన్న వారధిని తొలగించి కొత్త నిర్మాణాన్ని చేపట్టడంతో ప్రయాణికుల, ప్రజల బాధలు తీరనున్నాయి. వెంటనే పనులను ప్రారంభించాలి. – తొట్ల ప్రభాకర్‌గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి

తీరనున్న ఇబ్బందులు



గుండ్లసింగారం వద్ద కొత్త వారధి నిర్మాణానికి మోక్షం కలగడంతో ప్రయాణికుల సమస్య తీరనుంది. ప్రస్తుత వంతెన ఏ క్షణాన కూలుతుందోనని భయంతో ప్రయాణిస్తున్నాం. వెంటనే నూతన వంతెన నిర్మాణ పనులు చేపట్టాలి.
– పులుసు సైదులు, ఆటో డ్రైవర్, చిల్పకుంట్ల

సూర్యక్షేత్రంలో సౌరహోమం, పూజలు



సూర్యక్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని అఖండ జ్యోతి స్వరూప సూర్యనారాయణస్వామి క్షేత్రంలో ఆదివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున ఉషాపద్మిని ఛాయసమేత సూర్యనారాయణస్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపారు. ఆ తర్వాత యజ్ఞశాలలో మహాసౌర హోమం నిర్వహించారు. అలాగే క్షేత్ర ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదసత్రంలో ఆదిత్య సేవా కేంద్రం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కాకులారపు రజిత, గణపురం నరేష్, కర్నాటి నాగేశ్వర్‌రావు, గిరి, బెలిదె లక్ష్మయ్య, అర్చకులు భీంపాండే, మోనుపాండే, శ్రీరాంపాండే, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి



మాట్లాడుతున్న ధనుంజయ్‌నాయుడు

నూతనకల్ : బీసీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ రూపొందించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూదిపాల ధనుంజయ్‌నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీసీలను అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే తక్షణమే కేంద్రం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి రూ.2లక్షల కోట్ల నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో రెండు ఎకరాల విస్తీర్ణంలో బీసీ భవన్ నిర్మించాలని, బీసీ గురుకుల, కళాశాలలకు సొంత భవనాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు మూరగుండ్ల లక్ష్మయ్య, తొట్ల ప్రభాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో టాపర్లకు ఆర్థికసాయం, సన్మానం



ఆర్థికసాయం అందజేస్తున్న రేఖ

అర్వపల్లి : టెన్త్ ఫలితాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం పొందిన అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని వర్రె శ్రావ్య, అలాగే పదవ స్థానంలో నిలిచిన బండారు ఉదయాంజలికి రూ.5,016 చొప్పున ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు బండారు నాగరాజు, ఈగ శేఖర్, పిల్లల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

వీరయ్య మృతి పార్టీకి తీరని లోటు



పెన్‌పహాడ్ : వీరయ్య మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



అర్వపల్లి : శ్రీనివాస్‌కు నివాళులర్పించి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని భక్తాళాపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమ నాయకుడు గోపాల్‌దాస్ వీరయ్య (53) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం ఆయన మృతదేహాన్ని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీరయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వీరయ్య చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు, మిర్యాల వెంకటేశ్వర్లు, తూముల ఇంద్రసేనారావు, వీరబాబు, దాసరి శ్రీను, కృష్ణ, జుట్టుకొండ గణేష్, సతీష్, కాంగ్రెస్ నాయకులు యాట ఉపేందర్, నల్లపు రామ్మూర్తి, చింతం వెంకటేశ్వర్లు, ఉపేందర్ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌కు నివాళి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్ సోదరుడు, సాహితీ బిల్డర్స్ వ్యవస్థాపకుడు మొరిశెట్టి శ్రీనివాస్ గుండెపోటుతో మృతిచెందగా ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితోపాటు పలువురు నేతలు నివాళులర్పించారు. హైదరాబాద్‌లో అంత్యక్రియలను నిర్వహించారు.

కంఠ మహేశ్వరస్వామికి బోనాలు

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని తూర్పుగూడెం గ్రామంలో ఆదివారం గౌడకులస్తులు కంఠ మహేశ్వర స్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంఠ మహేశ్వర స్వామికి బోనాలను సమర్పించారు.

మంత్రులకు వినతి

కోదాడ : రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సింగిల్ పర్మిట్ విధానంపై నిర్ణయం తీసుకోవాలని, దీంతో రవాణా రంగంలో ఉన్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కోదాడకు చెందిన రాష్ట్ర లారీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రామినేని శ్రీను మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. ఆదివారం పట్టణానికి వచ్చిన వారిని ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని, ఆ హామీని నేరవేర్చాలని కోరారు. పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చినట్లు తెలిపారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అర్వపల్లిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు

అర్వపల్లి : అర్వపల్లిలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాల 2006–07 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అర్వపల్లిలోని లక్ష్మీ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 19 ఏళ్ల తర్వాత ఒకే చోట కలుసుకొని యోగ క్షేమాలు తెలుసుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుంభం రాంమూర్తి, రత్నం లక్ష్మాజీ, దబ్బేటి యాదగిరి, బాష, ముత్తయ్య, విద్యార్థులు పోలెబోయిన కిరణ్, వేముల మధు, వల్లాల నరేష్, పి.కృష్ణ, గిరిబాబు, సంపత్, సైదులు, రాము, నరేష్, శ్రావణి, సోని, సత్యవతి, సంధ్య, శృతి, సంపూర్ణ, శంకర్, నాగరాజు, యాదగిరి, సంతు, ఉపాధ్యాయులు సుగుణ, రాంప్రసాద్, జగన్, శ్రీనివాస్, సైదయ్య, సంపత్, వెంకన్న, కిరణ్, దేవయ్య, రవి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

రూ.2.25 లక్షల ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సామేల్

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన పగిడి రాములు అనారోగ్యంతో కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నారు. విషయాన్ని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వం నుంచి రూ.2.25 లక్షల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. ఎల్‌ఓసీ కాపీని ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుక్కడపు సైదులు, గంగదెరి శ్రీనివాస్, రామిడి వెంకట్‌రెడ్డి, బచ్చాటి ప్రవీణ్, సైదిరెడ్డి, ధర్మాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలి



ఎర్రపహాడ్‌లో పూజలు చేస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, తదితరులు

నూతనకల్ : సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంపొందించుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో హరిజనుల కుల దైవమైన సవారు లచ్చమ్మ అమ్మవారి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇరుగు శ్రీరాములు, ధర్మారపు వీరస్వామి, దంతాల వెంకన్న, పసుల అశోక్ యాదవ్, నకిరేకంటి వెంకన్న, మధు, కొలిచెల్మ లింగయ్య, పసుల రవి, లింగాల రాములు, మొండికత్తి పరశురాములు, సూరరాపు రవి, మరికంటి అశోక్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల కరపత్రం విడుదల



కరపత్రం విడుదల చేస్తున్న ఏఎస్‌ఐ, తదితరులు

చిలుకూరు : మండలంలోని రామాపురంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి 20వ తిరుకల్యాణ మహోత్సవం సందర్భంగా ఈ నెల 10, 11తేదీల్లో రాష్ట్ర స్థాయి ఇన్విటేషన్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం దేవాలయం ఆవరణలో గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కబడ్డీ నిర్వాహకులు, గ్రామపెద్దలు ఇనుగుర్తి వెంకటరమణచారి, పాయిలీ కోటేశ్వరరావు, రాయాభారపు వెంకటేశ్వర్లు, వేమూరి నాగేశ్వరరావు, నిగిడాల వీరయ్య, నలబోతు సత్యనారాయణ, తిపిరిశెట్టి శ్రీను, మీసాల గంగా లింగయ్య, నరసింహారావు, కృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పడకేసిన ప్రత్యేకాధికారుల పాలన



ఎర్ర సూర్యాతండాలో రోడ్డుపై ఉన్న మురుగు



గుంజలూరు గ్రామంలో చెత్తాచెదారంతో నిండిపోయిన మురుగు కాలువ

- గ్రామాల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- రోడ్లపైనే పారుతున్న మురుగు

చివ్వెంల : గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన గాడి తప్పడంతో సమస్యలలో ప్రజలు అవస్థలు పడుతున్నారు. చివ్వెంల మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా.. మండల కేంద్రంతోపాటు ఎర్ర సూర్యానాయక్ తండా, పిల్లలజెగ్గు తండా, బి.చందుపట్ల, గుంజలూరు, మొగ్గయ్యగూడెం, వాల్యతండా, లక్ష్మణ్ నాయక్‌తండా, వట్టిఖమ్మంపహాడ్, గుంపుల, తుల్జారావుపేట, వల్లభాపురం, ఉండ్రుగొండ, రోళ్లబండ తండా తదితర గ్రామాల్లో అధికారులు పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో రోడ్లపైనే మురుగు పారుతోంది. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్త, మురుగును నెలల తరబడి తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. అంతేకాకుండా దోమలు బెడద ఎక్కువవుతోందని, ఇళ్ల మధ్యన పిచ్చి మొక్కలు పెరగడంతో విషపురుగులు సంచరిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకపోతున్నాం

ప్రధాన రహదారిపై మురుగు పారుతున్నా గ్రామ పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదు. దుర్గంధం భరించ లేకపోతున్నాం. దోమల బెడద అధికంగా ఉంది. ప్రత్యేకాధికారులు గ్రామాలవైపు చూడటం లేదు.
– సాయికుమార్, ఎర్ర సూర్యానాయక్‌తండా

సమస్యలు పరిష్కరిస్తాం

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలను తొలగిస్తాం. పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి అన్ని గ్రామాలను సందర్శిస్తాం. సమస్యలు లేకుండా చూస్తాం.
– సీహెచ్. సంతోష్ కుమార్, ఎంపీడీఓ

లోయపల్లిలో ఉచిత మెగా వైద్యశిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, వైద్యసిబ్బంది

అర్వపల్లి : మండల పరిధిలోని లోయపల్లి గ్రామంలో ఆదివారం హైదరాబాద్‌లోని ఇంటిగ్రో హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 200 మంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఎండీ ఫైజుల్లాఖాన్, వైద్యులు లిలీసలీం, దిబేదిత ఫరిదా, జమీల్, సూర్య, హైదర్, సిబ్బంది మనోజ్, రఫి, ఫాతిమా, రమేష్, మాజీ సర్పంచ్ వల్లపు గంగయ్య, మల్సూర్, రవీందర్, రతన్, సురేష్, నాగు, గోవర్ధన్, కుశలవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించాలి

నడిగూడెం : మామిడికి మద్దతు ధర కల్పించాలని పండ్ల తోటల రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏనుగుల వీరాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని రామాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత కొద్ది రోజులుగా మామిడి తోటల కోతల పనులు జరుగుతున్నాయని, సీజన్ ఆరంభంలో మంచి ధర ఉన్నా ప్రస్తుతం టన్ను ధర రైతులకు అనుకూలంగా లేదన్నారు. రైతులు దళారులు చెప్పిన ధరలకే గత్యంతరం లేక విక్రయిస్తున్నారని అన్నారు. గత నాలుగేళ్లుగా మామిడి రైతుల పరిస్థితి బాగాలేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో మామిడికాయలు రాలడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం స్పందించి మామిడికి టన్నుకు రూ.లక్ష మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

మునగాల : మునగాల మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో 2025–26విద్యాసంవత్సరానికి గాను ఇంటర్ ప్రథ మ సంవత్సరంలో ప్రవేశానికి సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బూర సైదయ్య గౌడ్ ఆదివారం తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులకు సంబంధించి ప్రతి గ్రూపులో 40సీట్ల చొప్పున అడ్మిషన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి ఎటువంటి ఫీజు లేకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ నెల 5నుంచి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన విద్యార్థుల జాబితా మే 26న పాఠశాల నోటీసు బోర్డుపై ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మోడల్ స్కూల్‌లో ల్యాబ్స్, లైబ్రరీ సౌకర్యాలు ఉంటాయని, బాలికలకు ఉచిత వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అప్రమత్తత అవసరం

మునగాల : విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనదారులు, ప్రజలు అప్రమత్తత పాటించాలని ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ కోరారు. ఆదివారం మునగాల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేసవికాలంలో రైతులు పశువులను విడిచిపెట్టడంతో అవి రోడ్లపైకి వచ్చి సంచరించడం, రోడ్డును క్రాస్ చేయడం మూలంగా తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. జాతీయ రహదారిపై అతివేగంగా ప్రయాణించడంతో పశువులను ఢీకొని ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు లైసెన్సు కలిగిఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని సూచించారు.